3rd ANNIVERSARY

Estd:2023

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI. NO.: TELTEL/2023/85598

www.sooryasena.com








శుక్రవారం FRIDAY || 07.08.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 311 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah


# గోబర్ధన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం

## - రూ.23,731 కోట్లతో అమలు-సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం -అసోంలో నాలుగు లేన్ల నేషనల్ హైవే-కేంద్ర మంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026–27 నుంచి 2035–36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ సీబీజీ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. దిగుమతి సహజవాయు వుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చిందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని వివరించారు. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీ యూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన



సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది. ఇటు అసోంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.8,970 కోట్లతో అసోంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రివర్గం ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

# జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణకు 150 కొత్త జీసీసీలు 20 నెలల్లో రానున్నాయని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. జీసీసీలతో 1.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం జేఎల్ఎల్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా జేఎల్ఎల్ ఎంచుకుందని వెల్లడించారు. జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్ అని వివరించారు. ఏఐ, డీప్‌టెక్ రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోం దని ఉద్ఘాటించారు. జాతీయ జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతం ఉందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42శాతమని మంత్రి తెలిపారు. హెల్త్‌కేర్, బయోటెక్, సెమీకండక్టర్లకు హైదరాబాద్ తొలి ఎంపిక అని వివరించారు. జేఎల్ఎల్ జీసీసీతో రెండేళ్లలో 1,600 ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. ప్రపంచ



స్థాయి పెట్టుబడులకు తెలంగాణ ఆకర్షణ కేంద్రమని వెల్లడించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీతో పెట్టుబడులకు కొత్త ఊపు వస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధితో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జీసీసీల విస్తరణలో వేగం పెరిగిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు సీఎం నివాళి

**హైదరాబాద్, ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలు, మార్గదర్శకత్వం చిరస్మరణీయ పాత్ర పోషించాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు.

విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమ నాయకుడిగా జయశంకర్ సమాజానికి విశిష్ట సేవలు అందించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. జయశంకర్ చూపిన మార్గం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు.

ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షించిన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమ లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆయన ఆదర్శాలకు అనుగుణంగా తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

జయశంకర్ జీవితాన్ని ప్రజాసేవ, అంకితభావానికి ప్రతీకగా



అభివర్ణించిన ముఖ్యమంత్రి, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆయన ఆదర్శాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలకు మరోసారి తన ప్రగాఢ గౌరవాన్ని తెలియజేసిన ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన స్ఫూర్తి ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల తరఫున ఆ మహానేతకు ఘన నివాళులర్పిస్తూ, ఆయన చేసిన విశిష్ట సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు..

## ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

### - సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

**హైదరాబాద్, ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా,వీటిపై



కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించినపూర్తి వివరాలను ఆన్‌లైన్ లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

# హైదరాబాద్ వాసులకు చల్లని కబురు.. శనివారం వరకు వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** హైదరాబాద్‌వాసులకు భారత వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త అందించింది. శనివారం వరకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన ఈదురుగాలుల వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈవర్షాలతో నగరంలో ప్రస్తు తం నెలకొన్న వర్షపాతం లోటు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నా రు. ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు హై దరాబాద్‌లో సాధారణంగా 313.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, కేవలం 277.3 మి.మీ. మేర మాత్రమే కురిసింది. దీనివల్ల సుమారు 12 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాబోయే వర్షాలతో ఈలోటు భర్తీ కావడంతో పాటు, రాష్ట్రంలోని జలాశయాల నీటి మట్టాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం, రా ష్ట్రవ్యాప్తంగా వర్షపాతం దాదాపు సాధారణ స్థితిలోనే ఉంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 402.1 మి.మీ.కాగా, ఇప్పటివరకు 379 మి.మీ.నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 581 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక్కడ



సాధారణ వర్షపాతం 442.6 మి.మీ. మాత్రమే. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ సాధారణంకంటే ఎక్కువ వర్షాలు కురిశాయి.రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన తాజా బులెటిన్‌లో పేర్కొంది. వర్షం కురిసేసమయంలో గంటకు 30నుంచి 40కిలోమీటర్ల వేగంతో బలమై న ఈదురు గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేశారు.

# నిరసన తెలిపే యువత దేశ వ్యతిరేకులు కాదు

## – ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**న్యూఢిల్లీ, ఆగస్టు, 6 (సూర్యసేన ప్రతినిధి):** ఆందోళనలు,నిరసనలు చేపట్టినంత మాత్రాన యువతను (జెన్–జెడ్) దేశ వ్యతిరేకులుగా పరిగణించకూడదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ అభిప్రాయపడ్డారు. వారుమన సంతతి అని,మన తర్వాతితరమని పేర్కొన్న ఆయన, వారి ఆందోళనలను తప్పకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. గురువారం ముంబైలో నిర్వహించిన ఒక యువజన సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచ ఏకీకరణలో యువత పాత్ర – భారతీయ మార్గం" అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో భగవత్ ప్రసంగిస్తూ, "ఒకవేళ జెన్–జెడ్ ఆందోళనలు చేస్తుంటే, వారు కచ్చితంగా దేశ వ్యతిరేకులు కాదు. వారు మనవారే. మన భావి తరానికి ప్రతినిధులు" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో తమ గళాన్ని వినిపించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, యువత నిరసనలు చేయవద్దని తాను చెప్పడంలేదని వివరించారు. నేటియువత, ముఖ్యంగా జెన్–జెడ్, జెన్–



ఆల్ఫా తరాల వారుఎంతో నిజాయతీపరులని, వారిపై తనకు అపారమైన నమ్మకం ఉందని మోహన్ భగవత్ అన్నారు. ఇరుపక్షాలు ఒకరి అభిప్రాయాలను ఒకరు వినేలా అర్థవంతమైన చర్చలు జరగాలంటే కరుణ,అవగాహన, పరస్పరగౌరవం అవసరమని నొక్కిచెప్పారు. యువత ఏదైనా విషయంపై గళంమెత్తుతోందంటే, అది వ్యతిరేకత కోసం కాదని, వ్యవస్థలో మెరుగుదల కోసమేనని భావించాలని సూచించారు.







# నేతన్న నెత్తుటి నూలు....

## మంజుల పత్తిపాటి

మగ్గం మోగితే మన సంస్కృతి మేల్కొంటుంది...
కానీ ఆ ఇంట్లో నవ్వులు మోగడం లేదు..!
నూలు కదిలితే నవభారత కీర్తి ముందుకు సాగుతోంది...
కానీ ఆ కుటుంబం బతుకు ముందుకు సాగడం లేదు..!

చెమటను అద్భుత డిజైన్లతో చీరలో మలిచినాడు..!
కన్నీటిని కనురెప్పల మాటున
దాచుకుంటున్నాడు..!



అతడు అల్లిన పట్టు...
ఉన్నవారి ఇంట వనిడి
నవ్వవుతుంది..!
తన ఇంట మాత్రం చినిగిన చీర
దర్శనము ఇస్తున్నది..!

దేశం అతని కళను
కొనియాడుతుంది
కానీ.. కళకు తగిన ప్రతిఫలం లేక
అన్నం గిన్నె అటుకు ఎక్కి అలిగింది..!
అతడు అల్లిన చీరకు కాలి చప్పట్లు జేజేలు... అందుకే అతని కూతురి
పెళ్లి అప్పుల ముసుగులోనే ఆగిపోయింది..!
కళను కాపాడిన కర్మయోగి నేతన్న,
కలలను నేసిన కవియోగి నేతన్న,
అందుకే నేతన్నను కాపాడుకుందాం
జాతీయ చేనేత దినోత్సవాన్ని గర్వంగా జరుపుదాం.

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
హొచరవాణి 9347042218

# అత్యవసరం, ఆపద ఏదైనా 'డయల్ 112' కు కాల్ చేయండి: జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్




**- జిల్లాలో మొదటి రోజే 12 గంటల్లో 57 ఫిర్యాదులు**
**- వెంటనే స్పందించి, వేగంగా సేవలు అందించిన పోలీసులు**
**- 18 రకాల అత్వసర సేవలు ఒకే నంబర్ పరిధిలోకి..**
**- సద్వినియోగం చేసుకోవాలని ఎస్పి పిలుపు**

**సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన) :** ప్రజలకు అత్యవసర సమయాల్లో తక్షణ రక్షణ, సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'డయల్ 112' (ఆల్ ఇన్ వన్) సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా పోలీస్ ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఈ సేవలు ప్రారంభమైన మొదటి రోజే అద్భుత స్పందన లభించిందని తెలిపారు.

కేవలం మొదటి 12 గంటల వ్యవధిలోనే డయల్ 112 నంబర్‌కు 57 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. ఈ ఫిర్యాదులపై జిల్లా పోలీసులు అత్యంత వేగంగా స్పందించి, బాధితులకు తక్షణమే రక్షణ మరియు అవసరమైన సేవలను అందించారని అభినందించారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం 18 రకాల అత్యవసర సేవలను ఒకే ఒక్క 'డయల్ 112' నంబర్ పరిధిలోకి తీసుకువచ్చిందని ఎస్పీ వివరించారు.

ప్రమాదాలు, ఆపదలు, శాంతిభద్రతల సమస్యలు లేదా మరేదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు ఎలాంటి సంకోచం లేకుండా 112 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను కాపాడేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్పష్టం చేశారు.

# ఏఈఓలను పాత పద్ధతిలోనే ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్)కు పంపాలి...



**- 5% కోటా తప్పనిసరిగా అమలు చేయాలి : జిల్లా ఏఈఓల సంఘం**

**భానుపురి, ఆగస్టు 06 (సూర్య సేన) :** రాష్ట్ర సెంట్రల్ ఫోరం సూచనల మేరకు, ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్) ప్రవేశాలలో పాత విధానాన్ని కొనసాగిస్తూ ఏఈఓలను సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 5% ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా ఏఈఓల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి (డి ఏ ఓ) కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, జి.ఓ.ఎం.ఎస్. నెం.250, తేదీ 06.10.2009 స్ఫూర్తికి అనుగుణంగా డిప్లొమా అర్హత కలిగిన ఏఈఓలకు ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్)లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం అమలవుతున్న విధానం వల్ల సీనియర్ ఏఈఓలు అవకాశాలు కోల్పోతుండటంతో జి.ఓ. నెం.250 యొక్క ఉద్దేశ్యం దెబ్బతింటోందని, గత విద్యా సంవత్సరంలో 31 మంది ఏఈఓలకు అవకాశం కల్పించగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో కేవలం 19 సీట్లు మాత్రమే కేటాయించడం వల్ల అర్హులైన అనేక మంది ఏఈఓలు నష్టపోతున్నారని తెలిపారు. అందువల్ల పాత విధానాన్ని కొనసాగించి 5% ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ఏఈఓల సేవా ప్రయోజనాలు, విద్యా మరియు ఉద్యోగోన్నతి అవకాశాలకు ప్రతికూలంగా ఉన్న జి.ఓ.ఎం.ఎస్. నెం.39ను రద్దు చేయాలని కూడా వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అనుబంధ సంఘం టి ఏ ఈ ఓ ఏ జిల్లా అధ్యక్షులు పెద్దపంగ ప్రణయ్, జిల్లా కార్యదర్శి డి. మనోజ్ కుమార్, జిల్లా ట్రెజరర్ షేక్ ముస్తఫా, రాష్ట్ర సెంట్రల్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడి మురళి, ఏఈఓలు శ్రీను, శైలజ, వెంకటేష్, శ్యామ్ పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా....

**- ముత్యాలమ్మగుడి ఏరియా హాస్పిటల్ సెక్టార్-3లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ముత్యాలమ్మగుడి ఏరియా హాస్పిటల్ సెక్టార్-3 పరిధిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు తల్లిపాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ముఖ్యంగా ప్రసవం అనంతరం లభించే ముర్రుపాల విశిష్టతపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

అనంతరం తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తల్లులు తమ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని, ముర్రుపాలను వృథా చేయకుండా శిశువుకు అందించాలని సూచించారు.




ఈ సందర్భంగా చిన్నారులకు కౌన్సిలర్ చేతుల మీదుగా యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ నరసింహారావు, సీడీపీఓ సుబ్బలక్ష్మి, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్ శారద, జీకే సునీత, ఆయాలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి...





**నల్గొండ, ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి డిఎస్పీ మల్లారెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐ లు,ఆర్.ఐ లు , మినిస్టీరియల్ సిబ్బంది,మహిళా పోలీసు సిబ్బంది,మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘన నివాళులర్పించారు.

# ఎల్ నీనో సెగ నుంచి ఉపశమనం...

**- కూరగాయల సాగుతో రైతులకు శాశ్వత ఆదాయం**
**- జిల్లా ఉద్యానపట్టు పరిశ్రమల అధికారి తీగల నాగయ్య**





**సూర్యాపేట, ఆగస్టు 06, (సూర్య సేన) :** వర్షాభావ పరిస్థితులు, ఎల్ నీనో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, ఎక్కువ నీటి అవసరం ఉన్న సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయల సాగును చేపట్టాలని సూర్యాపేట జిల్లా ఉద్యానవన శాఖ రైతులకు సూచిస్తోంది.

ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి తీగల నాగయ్య మాట్లాడుతూ, మారుతున్న కాలగుణానికి అనుగుణంగా నీటి యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కూరగాయల సాగు చేపడితే తక్కువ నీటితోనే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా లభించే సబ్సిడీలు మరియు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రైతులపై ఆర్థిక భారం తగ్గించడానికి మరియు కూరగాయల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం క్రింది సబ్సిడీలను అందిస్తోంది:

కూరగాయల విస్తరణ పథకం :-

హైబ్రిడ్ కూరగాయల సాగును విస్తరించేందుకు ఎం.ఐ.డి.హెచ్ (ఎం ఐ డి హెచ్ ) కింద ఎకరానికి ?9,600 చొప్పున (50% సబ్సిడీ) అందజేస్తారు.

ప్లాస్టిక్ మల్చింగ్ ( ఎం ఐ డి హెచ్ ):

నేలలో తేమ ఆవిరి కాకుండా కాపాడేందుకు మరియు కలుపు నివారణకు మల్చింగ్ షీట్ల కొనుగోలుపై ఎకరానికి ?8,000 చొప్పున (50% సబ్సిడీ) లభిస్తుంది.

తీగ జాతి కూరగాయలకు శాశ్వత పందిళ్లు (ఆర్ కే వి వై ):

సొర, కాకర, బీర వంటి తీగ జాతి కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడి పొందేందుకు వేసే శాశ్వత పందిళ్ల నిర్మాణానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్ కే వి వై ) కింద ఎకరానికి ?1.00 లక్ష సబ్సిడీ (50% సబ్సిడీ) అందించబడుతుంది.

ఉపాధి హామీ అనుసంధానం :

నూతనంగా అమల్లోకి వచ్చిన వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ ( వి.బి.జి-రామ్-జి) పథకం ద్వారా కూడా పందిళ్ల నిర్మాణం, తోటల పెంపకం మరియు ఫీల్డ్ పనులకు కూలీల వేతనం రూపంలో సబ్సిడీ / ఆర్థిక సహాయం లభిస్తుంది.

టి.జి.ఎమ్.ఐ.పి ద్వారా బిందు సేద్యం పరికరాలు :

తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద ప్రతి బొట్టు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వర్గం ఆధారంగా (ఎస్ సి , ఎస్ టీ , చిన్న మరియు సన్నకారు రైతులకు) సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తున్నారు. ఎల్ నీనో సమయంలో కూరగాయల సాగుతో కలిగే ప్రయోజనాలు

నీటి పొదుపు: డ్రిప్ మరియు మల్చింగ్ ఉపయోగించడం వల్ల వరి, పత్తి పంటలతో పోలిస్తే 40% వరకు నీరు ఆదా అవుతుంది.

శాశ్వత పందిళ్లతో నాణ్యమైన దిగుబడి: పందిరి సాగు వల్ల కాయలు మట్టికి తగలకుండా, పురుగులు పట్టకుండా గుణాత్మకమైన అధిక దిగుబడి వస్తుంది.

లి తక్కువ కాలపరిమితి ఉ



నిరంతర ఆదాయం: కూరగాయలు తక్కువ సమయంలో కోతకు వచ్చి రైతుల చేతికి నిరంతరం నగదు ప్రవాహాన్ని అందిస్తాయి.

రైతులకు విజ్ఞప్తి: ఈ పథకాలను ఉపయోగించుకోవాలనుకునే రైతులు వెంటనే తమ పరిధిలోని ఉద్యాన అధికారి, ఉద్యాన విస్తరణ అధికారుల(ఎచ్ ఈ ఓ )ను , సూర్యాపేట జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని డి.హెచ్.ఎస్.ఓ టి. నాగయ్య కోరారు.



# స్వర్గీయ గోరే జానీ జ్ఞాపకార్థం ఉచిత కంటి పరీక్షలు

**- 28వ వార్డు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన స్వర్గీయ గోరె జానీ కుమారులు**
**- ఖదీర్, ఫరీద్ ల సేవాభావం అభినందనీయం: గుడుగుండ్ల గోవర్ధన్**




సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన): పట్టణంలోని ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులు తమ తండ్రి స్వర్గీయ గోరే జానీ జ్ఞాపకార్థం 28వ వార్డు ప్రజలకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.

ఆయన కుమారులు ఖదీర్ ఆర్ట్స్ ప్రింటర్స్ ఖదీర్, ఫరీద్‌ల ఆధ్వర్యంలో ఏఆర్ హాస్పిటల్ సౌజన్యంతో గురువారం ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు గుడుగుంట్ల గోవర్ధన్ కు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ రంగంలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు.

వారి తండ్రి జ్ఞాపకార్థం 28వ వార్డు ప్రజల కోసం ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

**సేవా కార్యక్రమాలతో తండ్రి జ్ఞాపకాలు చిరస్థాయిగా**

తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల ద్వారా స్మరించుకోవడం గొప్ప విషయమని ఆయన అన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం గోరే జానీ కుమారులు ఖదీర్, ఫరీద్ మాట్లాడుతూ తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఏఆర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూర్ ఆర్ట్స్, లతీఫ్ ఆర్ట్స్, ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు, ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ సిబ్బంది, పలువురు స్థానికులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాధనే జయశంకర్ సార్ జీవిత లక్ష్యం

**– తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు**
**– ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**నల్గొండ ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని, సేవలను స్మరించుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను గణాంకాలు, వాస్తవాలతో ప్రపంచానికి వివరించిన ఆయన తెలంగాణ సిద్ధాంతకర్తగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన జయశంకర్ సార్ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ






మోతిలాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, విభాగాల అధిపతులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

## జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





**– నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రజలను ఏకతాటిపైకి తెచ్చిన మహనీయుడు**

**సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రజలను, నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. తెలంగాణకు చెందిన నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.
ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌తో కలిసి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం పాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం అనంతరం స్వతంత్ర భారతదేశంలో భాగమైనప్పటి నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలను ప్రొఫెసర్ జయశంకర్ పోరాటాలు, సాహిత్యం ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని అన్నారు. మన ప్రాంతానికి చెందిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తే ప్రాంతంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో ఉద్యోగాల కోసం ప్రజల తరపున ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ వారికే దక్కాలని, తెలంగాణ సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే న్యాయం జరుగుతుందని జయశంకర్ భావించారని కలెక్టర్ పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే రీతిలో తెలంగాణ సమస్యలను వివరించి ప్రజలను ఐక్యం చేసి సుదీర్ఘ ఉద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో దిశానిర్దేశం చేశారని కొనియాడారు. జయశంకర్ సార్ ఆలోచనలు, ఆశయాలను అర్థం చేసుకుని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఉద్యోగి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఉద్యోగులందరూ సమిష్టి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మనం ఎక్కడి నుంచి వచ్చామో మర్చిపోకూడదని, సమాజంలో స్థిరమైన మార్పు తీసుకురావడానికి ఉద్యోగులందరూ ఒక బృందంగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ మాట్లాడుతూ మలి తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలని, తెలంగాణ భూములు తెలంగాణ ప్రజలకే ఉపయోగపడాలనే లక్ష్యంతో ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరువకూడదని, ఆయన జయంతి సందర్భంగా మహనీయుడిని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ప్రేమ్‌రాజ్, సీపీఓ కిషన్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీటీఓ రవికుమార్, ఇన్‌చార్జ్ పరిపాలన అధికారి శ్రీలతతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలే రైతులకు అండ





**– పొలాలను ఖాళీగా ఉంచొద్దు..కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని రైతులు పొలాలను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై సమీక్షించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఆగస్టుతో పాటు సెప్టెంబర్ మొదటి వారంలో సరైన వర్షాలు కురిసే అవకాశం లేదని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో కిందికి నీటిని విడుదల చేసే అవకాశం కూడా తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొలాలను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అధికారులు రైతుల వద్దకు వెళ్లి కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో సుమారు 4 వేల ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు అవకాశం ఉందని, వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా ప్రతి రైతును ప్రోత్సహించాలని సూచించారు. కూరగాయల సాగుకు అనుకూలమైన భూములను గుర్తించి కూరగాయలు సాగు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆగస్టు నెలలో వేసుకునే ఆరుతడి పంటలను కూడా ప్రోత్సహించాలని తెలిపారు. కమాండ్ ఏరియాలోనూ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక పంటల సాగుకు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన కాంటింజెన్సీ ప్లాన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరోసారి మండలాల వారీగా రైతుల నుంచి పంటల వివరాలను సేకరించడంతో పాటు పంటల వైవిధ్యంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియను నాలుగు, ఐదు రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. ఉద్యాన, కూరగాయల పంటల సాగు సమయంలో అడవి పందులు, ఇతర జంతువుల బెడద తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అయితే పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల విషయంలో ఏ రైతునూ బలవంతం చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.
రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై అవగాహన కల్పించి, వారి సమ్మతితోనే ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి టి. శేఖర్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని వేడుకలు



**సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన) :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి స్మరించుకున్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడీ, డిసిఆర్బి డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దుం అలి, ఆర్ఐ జానయ్య, ఆర్ఎస్ఐ లు సురేష్, రాజశేఖర్, సాయిరాం, అన్వర్, అశోక్, సీసీ సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.







## శ్రీ వాసవి సేవా సమితి జిల్లా కమిటీకి రవీంద్ర భారతిలో సన్మానం




**భానుపురి, ఆగస్టు 06 (సూర్య సేన) :** శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్థాపించి గత ఏడు నెలల కాలంలో 150 సభ్యత్వముల సేకరణ తో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను గురువారము హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో శ్రీ వాసవి సేవాసమితి 10 వార్షికోత్సవ సందర్భముగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ కార్య వర్గ సభ్యులు కొండా అనిల్ కుమార్ ల ను సుప్రీమ్ కోర్టు న్యాయవాది నేరేళ్ల మాల్యాద్రి, యాదగిరి గుట్ట ధర్మకర్త గుండా మల్లయ్య గుప్తా, శ్రీ వాసవి సేవాసమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి లు శాలువాలు, షీల్డ్ అందజేసి సన్మానించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటలో శ్రీ వాసవి సేవా సంస్థ ద్వారా బడుగు బలహీన వర్గాలకు సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు శ్రీ వాసవి సేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి






**– అక్రమ పార్కింగ్, ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, ఆగస్టు 06 (సూర్య సేన) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. రోడ్డు భద్రత చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేసి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలన్నారు గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సంబంధిత పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని అన్నారు. గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణ చర్యలు చేపట్టి, ప్రమాదాల నివారణకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేయాలని సూచించారు.
జాతీయ, రాష్ట్ర, ప్రధాన జిల్లా రహదారులపై అక్రమ పార్కింగ్, రోడ్డు ఆక్రమణలు, రాత్రి వేళల్లో హెచ్చరిక లైట్లు లేకుండా రోడ్లపై నిలిపే లారీలు, ఇతర వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో వాహనాలు నిలిపే సందర్భంలో రిఫ్లెక్టివ్ టేపులు, హెచ్చరిక లైట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలలు, బస్‌స్టాండ్లు, ఆసుపత్రులు, ప్రధాన కూడళ్లను ప్రత్యేక రోడ్డు భద్రత జోన్లుగా గుర్తించి జీబ్రా క్రాసింగ్‌లు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల వద్ద విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్య సేవలు అందేలా అంబులెన్స్ సేవలను మరింత సమర్థంగా వినియోగించాలని అన్నారు. పోలీసు, రవాణా, వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, రవాణా శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు కలిసి రోడ్డు భద్రతపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే అంశాలను వెంటనే పరిష్కరించడం, అవసరమైన చోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ బ్లాక్‌స్పాట్లను సందర్శించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపే విధానానికి అడ్డుకట్ట వేసి, వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రాంతాలను గుర్తించాలని అన్నారు. మండల స్థాయిలో రోడ్డు ప్రమాదాల నివారణకు తహసీల్దార్లు, మండల ఎస్‌హెచ్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్ సేఫ్టీ కమిటీ ద్వారా రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా డిప్యూటీ కమిషనర్ వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కోట మైసమ్మ బోనాలు నిర్వహిద్దాం

**– ఈనెల 16న బోనాల ఉత్సవాలు, భక్తులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి**
**– కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న**



**సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** భక్తిశ్రద్ధలతో కోట మైసమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించి విజయవంతం చేయాలని కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 48వ వార్డు శ్రీశ్రీ కోట మైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16న కోట మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఆగస్టు 15న పట్టు వస్త్రాలు, జలబిందాలతో ఊరేగింపుగా అమ్మవారికి సమర్పిస్తామని చెప్పారు. బోనాల ఉత్సవాలకు 48 వార్డుల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులందరినీ ఉత్సవాలకు ఆహ్వానించి దేవాలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతామని చెప్పారు. అలాగే నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు నల్లమేకల వెంకన్న, ఈర్ల వాసు, ఇండ్ల వీరయ్య, శ్రీధర్, కోల నిరంజన్, నక్కల శ్రీనివాస్, అంజమ్మ, లక్ష్మీనారాయణ, కోల వీరేందర్, సైదులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 7, 2026

## పదేళ్లలో 61 యుద్ధాలు... ముగింపు ఎప్పుడు


భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి. 2016?2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాలు, ఉగ్రవాద గుండాలు, విముక్తి సంస్థలు పాల్గొన్నాయి. యూరప్‌లో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం మ్యాపులు మార్చింది. యూరప్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. మాజీ రష్యా ప్రాంతం అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లో, గల్ఫ్‌లో 1948 నుంచి అనేక దేశాలు యుద్ధాల్లో ఉన్నాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990?91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడమే ఇందుకు కారణం. ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళ్లు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియజేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఆయుధాలతో పాటు, సైబర్ దాడులు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు (ఖతీనీజూజీణజీనిటజీ) కూడా ఈ యుగంలో భాగమయ్యాయిఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షణ సిరియాపై దాడి చేసింది. ఇక భారత్‌లో 2017లో డోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది. ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొం టారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి. నేరము, శిక్ష, ద్వేషం, జాతి వైరం, తెగింపు వంటి భావాలు సమాజాన్ని చాలాకాలం అంటిపెట్టుకొని ఉంటాయి. సమాజం ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోలుకోవ డానికి సంవత్సరాలు లేదా దశాబ్దాలు పట్టవచ్చును. దేశ వనరులు చాలావరకు ప్రగతి నుండి సైనిక అవసరాలకు కేటాయింపబడవచ్చు ను. దేశంలో నెలకొన్న సంక్షోభం వల్ల, జనంలో రేకెత్తిన తీవ్ర భావాల వల్ల ప్రజలను రెచ్చ కొట్టే నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనే అవకాశం ఎక్కువవుతుంది. అణ్వాయు ధాలు, రసాయనిక ఆయుధాలు, మందు పాతరలు వంటి వాటి వినియోగాల వల్ల ఆరోగ్యం, జీవనం అస్తవ్యస్తం కావచ్చు ను. 2022లో యుద్ధం జరిగినప్పుడు అజర్‌బైజాన్ ఆధిపత్యం కనబర్చింది. 2023లో జరిగిన యుద్ధంలో 1.5 లక్షల మంది ఆర్మేనియాకు వెళ్లారు.


సూర్యసేన

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం


సంప్రదించండి: 9951241048


# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే చరిత్ర క్షమించదు




రాష్ట్రంలో మన భారత రాజ్యాంగ పీఠిక అభాసు పాలవుతున్నది. పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వేదన కలిగిస్తున్నది. బాధ్యతాయుత ప్రభుత్వం చేయాల్సిన పని ఇలా కానే కాదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన కాళరాత్రులను ప్రజల జీవితాల్లోకి ప్రవహింప చేస్తున్నది. చట్టం ముందు అందర్నీ సమానంగా చూస్తామని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేసిన నాయకులు వాటిని గాలికొదిలేస్తున్నరు. ఎవ్వరూ చెప్పినా.. ఎంత చెప్పినా.. ప్రజల గగ్గోలు పెడుతున్నా... గోడు గోడమని గోస పడుతున్నా కనీసం కనికరించడం లేదు. ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చేస్తారో తెలియదు. ఎప్పుడు ఎక్కడ హైడ్రాపేరుతో బుల్డోజర్లు వస్తాయో తెలియని భయానక వాతావరణం నేడు రాష్ట్రంలో కన్పిస్తూ ఉన్నది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రజల ముందు ఉంచింది. ఏడో గ్యారెంటీగా భావప్రకటనా స్వేచ్ఛను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రజల ఆస్తులు కూలుస్తామని ఎనిమిదో గ్యారెంటీని చెప్పకుండా దాచుకున్నది. ఇప్పుడు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నదనే అనుమానం ప్రజల్లో కలిగేలా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వ్యవహార శైలి గురించి మరింత నిర్దుష్టంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీ అయిన ఆర్టికల్ 19, 21తో పాటు చట్టబద్ధమైన ఆస్తి హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. తమ జీవన భద్రతకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. 1973లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. అదే కేశవానంద భారతీ కేసుగా చరిత్రకెక్కింది. పౌరుల హక్కుల కంటే పార్లమెంట్, అసెంబ్లీ చేసిన చట్టాలు మహోన్నతమైనవి ఏమీ కాదని చెప్పింది. హైడ్రాపై అసెంబ్లీ ఆమోదముద్ర వేయించుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులను, వారి గౌరవ ప్రదమైన జీవితాలను ధ్వంసం చేసేహక్కు చట్టసభలకు ఉంటుందా? ప్రజల జీవితాలకు రక్షణ లేకుండా చేయాలని చట్టాలు చెప్తున్నాయా.? ప్రభుత్వం వహరిస్తున్న తీరు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధం కాదా? 1960-80 మధ్య కాలంలో భారత రాజ్యాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భం. ఎస్ఆర్ బొమ్మై కేసు, కేశవానంద భారతి కేసుతోపాటు చాలా కేసుల్లో న్యాయస్థానాలు చొరవ తీసుకోవడం వల్ల భారత ప్రజాస్వామ్య సజీవతకు బీజం పడింది. అంతేకాదు పౌరులు గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే ధైర్యాన్ని కూడా న్యాయ స్థానాలు కల్పించాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కోర్టులు మొట్టికాయలు వేసినా తన తీరు మార్చుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇది ఇటీవల పరాకాష్టకు చేరింది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్లలో పేదలకు చెందిన వందలాది నివాసాలను ధ్వంసం చేసింది. ప్రజల పట్ల ప్రేమ లేకపోవడమే ఇందుకు కారణమా? లేకపోతే చట్టాల పట్ల గౌరవం లేకపోడమే కారణమా? తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారా? కాంగ్రెస్ పార్టీ తమది ప్రజాస్వామ్యయుత నేపథ్యం అని చెప్పకుంటుంది. కానీ చర్యలు మాత్రం దానికి భిన్నంగా ఉంటాయి. భవిష్యత్తు అభివృద్ధి కోసమని గడిచిన ఏడు దశాబ్దాలుగా ఇక్కడి పేదలకు జీవనాధారమైన భూములు కోల్పోయారు. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడి వారు మాత్రం మౌలిక సదుపాయాల కోసమని, నైట్‌మార్కెట్ కోసమని నివాసాలను, భూములను కోల్పోతున్నారు. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రకారం ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు, వ్యా పారాలు చేసుకోవచ్చు. నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఇతరుల కోసం తరాలకు తరాలు ఆస్తులు కోల్పోవడాన్ని రాజ్యాంగం సమర్థిస్తుందా? ఇక్కడి పేదలను నిలువునా ముంచుతామని అంటే నిర్దేశిత చట్ట నియామాలు మౌనంగా ఉంటాయా? ఎలాంటి అభివృద్ధి అయినా సరే విధ్వంసం, విస్తాపనకు ప్రత్యామ్నాయాలు లేనే లేవా? ఈ తీరులో పాలకులు ఎందుకు ఆలోచించడం లేదు? మూసీ సుందీకరణ కోసం సుమారు యాభై కిలోమీటర్ల మేర లక్షలాది నివాసాలను ధ్వంసం చేస్తామని అంటే ఎట్లా ఊరుకోవాలి? చిన్నచిన్న పనులు చేసుకొని పొట్ట పోసుకుంటున్న బడుగు జీవుల గూళ్లను చెదరగొడ్తామంటే ఎట్లా? మధ్యతరగతి వారి జీవితపు కలం సొంత ఇల్లు. బ్యాంకు లోన్లు తీసుకొని ఏండ్లకు ఏండ్లు కిస్తీలు కట్టుకుంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తామంటే ఎట్లా? ప్రైవేటు రంగంలో జీవన భద్రతకు గ్యారెంటీ లేదు. అప్పుల మధ్యనే జీవితం సాగుతూ ఉంటుంది. అలాంటి వారికి రేపటి నుంచే మీ ఇండ్లు ఉండవు పోండి! అంటే వారు ఎక్కడ తలదాచుకోవాలి? జీవితం అల్లకల్లోలం అవుతున్నట్టే కదా? తాజాగా సంగారెడ్డిలో హైడ్రా కూల్చివేతల గురించి మీడియాలో వీడియోలు చూస్తే భయాందోళనలు కలుగుతున్నాయి. కూల్చే యంత్రానికి హృదయం లేదు. కానీ పైనుంచి ఆదేశాలిచ్చే వారికి, వాటిని అమలు చేసే వారికి హృదయం ఉంటుంది కదా? అది పనిచేయడం లేదు ఎందుకు? లేకపోతే అధికారానికి కండ్లు ఉండవు, సంపదకు ఆత్మ ఉండదనే నానుడిని నిజం చేస్తున్నారా? ఎవరెట్లా అనుకున్నా తాము అనుకున్న విధంగా ముందుకెళ్తామనే ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారా? కాంగ్రెస్ పాలనలో కూల్చడం తప్పా నిర్మించడం ఎక్కడైనా ఉన్నదా? కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమున్నదని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అంతా తమ ఇష్టం అనే భావనతో పాలకులు ఉంటే గనుక ముమ్మాటికీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టే, పౌరుల జీవన భద్రతను గాలికి వదిలేసినట్టే.. భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నట్టే. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలక పెద్దలు తప్పును సరిచేసుకోకుంటే చరిత్ర అస్సలు క్షమించదు.

# పురుషుల్లో రొమ్ము క్యాన్సర్



హైదరాబాద్, : ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మందిని క్యాన్సర్ మహమ్మారి బలిగొంటుండగా.. పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోంది. రొమ్ము క్యాన్సర్ కేవలం మహిళలకే వస్తుందన్న అపోహ వల్ల పురుషులు లక్షణాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా 87 శాతం కేసులు చివరి దశలో బయటపడుతున్నాయని సనత్‌నగర్ ఈఎస్ఐసీ అధ్యయనం వెల్లడించింది. ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయగలిగే ఈ వ్యాధిని అవగాహన లోపం వల్ల ప్రాణాంతకంగా మార్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచాన్ని శరవేగంగా కబళిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు కోటి మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలోనూ లక్షల సంఖ్యలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఒకసారి క్యాన్సర్ బారిన పడితే బయటపడడం చాలా కష్టం. చికిత్స తీసుకుంటూనే మరెన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక రొమ్ము క్యాన్సర్ అనగానే కేవలం మహిళలకు మాత్రమే వచ్చే వ్యాధిగా సమాజంలో ఒక బలమైన ముద్ర ఉంది. కానీ, పురుషుల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతోందని, అది కూడా ప్రాణాంతకమైన చివరి దశలో బయటపడుతోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ 2019 నుంచి 2025 మధ్య కాలంలో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈఎస్ఐసీ అధ్యయనంలో పాల్గొన్న 15 మంది రోగుల డేటాను విశ్లేషించగా.. అందులో 60 శాతం మంది థర్డ్ స్టేజ్‌లో, 26.7 శాతం మంది ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నప్పుడు మొదటిసారి డాక్టర్‌ను సంప్రదించారు. అంటే సుమారు 87 శాతం మందిలో క్యాన్సర్ శరీరం అంతటా వ్యాపించిన తర్వాతే చికిత్స ప్రారంభమైంది. లక్షణాలు కనిపించినప్పటి నుంచి వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు సగటున ఆరు నెలల జాప్యం జరుగుతోందని డాక్టర్లు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులలో చాలా మందికి చనుమొన వెనుక గడ్డలు, చర్మం మెద్దుబారటం, చనుమొన లోపలికి కుంచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. ఇద్దరు రోగులలోనైతే వ్యాధి తీవ్రత పెరిగి పుండ్లు కూడా పడ్డాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు. ఈఎస్ఐసీ ఆంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ గుమ్మల్ విశేష్ మాట్లాడుతూ.. ఆయా రోగుల్లో ఎవరికీ ఫ్యామిలీలో క్యాన్సర్ హిస్టరీ, హార్మోన్ల సమస్యలు వంటి ముందస్తు ముప్పు కారకాలు లేవని చెప్పారు. పురుషుల్లో ఈ వ్యాధి అరుదు కావడంతో.. ప్రారంభ లక్షణాలను తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ జాప్యానికి కారణమని అంటున్నారు. ఇక 2025లో జరిగిన ఫాలోఅప్ ప్రకారం.. 60 శాతం మంది రోగులు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఇద్దరు వ్యాధి తీవ్రతతో మరణించగా..26.7 శాతం మంది చికిత్స ఆపేశారు. ఈఎస్ఐసీలో ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ.. సుదూర ప్రయాణాలు, సామాజిక వివక్ష, అవగాహన లోపం వల్ల రోగులు చికిత్సకు దూరమవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. మహిళల రొమ్ము క్యాన్సర్‌పై ఉన్నంత అవగాహన పురుషుల విషయంలో లేకపోవడం పెద్ద లోపంగా మారిందని అంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ మార్గదర్శకాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ హెల్త్ మెసేజింగ్‌లో పురుషుల రొమ్ము క్యాన్సర్‌ను కూడా చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగుపడుతుందని అయితే జాతీయ స్థాయిలో దీనిపై ప్రత్యేక విధానాలు రావాలని నిపుణులు కోరుతున్నారు




# ముందుచూపు

భగభగమండే ఎండల తరువాత మొదలయ్యే ఖరీఫ్ కాలం... అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా మామూలే! విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి ...

తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇందులో సాగునీటికి అవసరమైన వర్షాలు తప్ప మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందుచూపుతో ముడిపడి ఉన్నవే! అయినా, ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వహించటం వల్ల, ముందస్తుగా అవసరమైనన్ని విత్తనాలూ, ఎరువులూ సమకూర్చకపోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురై, గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా వస్తోంది. పుండు మీద కారం చల్లినట్టు- ఈసారి ఈ కష్టాలన్నింటికీ తోడు ఒకవైపు అమెరికా యుద్ధోన్మాద పర్యవసానం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈపాటికే హెచ్చరించింది. ఈ కారణాలను సాకుగా చూపించి, చేతులు ఎత్తేయకుండా- ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకులు తమ తక్షణ కర్తవ్యంగా పెట్టుకోవాలి.

చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం మరొక శరాఘాతం. ఏటా 600 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను మనదేశంలో ఉపయోగిస్తున్నారు.

# ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు



**అనంతగిరి, ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన మేధావి,తెలంగాణ భావజాల పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మండల తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు రూపమిచ్చిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. నీరు,నిధులు,నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజపరిచారని కొనియాడారు.

ఆయన ఆశయాల మేరకు పేద ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే మనందరి బాధ్యత అని సిబ్బందికి సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బోధనలు, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన బాటలో ప్రజాసేవ చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకట నగేష్,సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్,తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా

అనంతగిరి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన): అనంతగిరి మండల పరిధిలోని పాలారం తండా గ్రామంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన సర్పంచ్ భూక్య నారాయణ ఈ సందర్భంగా ఆయన తెలంగాణ సాధనలో చేసిన కృషిని కొనియాడిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మేకల శేఖర్ ,ఉప సర్పంచ్ లక్ష్మి ,అంగన్వాడి టీచర్ విజయ, వార్డు సభ్యులు మరియు ఆశా వర్కర్ ఉమా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవాలి



గరిడేపల్లి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) : మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న సునంద రైస్ ఇండస్ట్రీ నుంచి వెలువడుతున్న కాలుష్యం, దుమ్ము, శబ్దం, దుర్వాసనతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, మిల్లుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. జూన్ 8న వంద మంది గ్రామస్థుల సంతకాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు విచారణ చేపట్టలేదని ఆరోపించారు.

అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై మిల్లుకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని సమాచార హక్కు చట్టం కింద ఎంపీడీవోకు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోఆర్డినేటర్ కుర్రి వెంకన్న, గ్రామ అధ్యక్షుడు పిట్ట వెంకటేష్, నకిరేకంటి రవి, ఆలంపల్లి శేఖర్, కొత్తపల్లి పవన్, బచ్చలకూరి నాగార్జున, పిట్ట నాగరాజు, మచ్చ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ.. పారదర్శకతే లక్ష్యం

**– రాజకీయ పార్టీలు సహకరించాలి.. ఆగస్టు 10 వరకు బీఎల్‌ఓల ఇంటింటి సర్వే**

**– నాలుగు నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్, డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**





**సూర్యాపేట కలెక్టరేట్, ఆగస్టు 06 (సూర్య సేన) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బీఎల్‌ఓల ఇంటింటి సర్వే గడువును క్షేత్రస్థాయిలో ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా 100 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి తప్పులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల నాయకులు బీఎల్‌ఓలు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుని ఓటర్ల వివరాలను ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఆగస్టు 10 వరకు గడువు ఉన్నందున ఈ ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలించి ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కోరారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన కొత్త పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలోని ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియలో అధికారులకు సహకరించాలని కోరారు. పారదర్శకమైన, తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీలు, ప్రజలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి సీహెచ్ రాజేశ్వరరావు, బీజేపీ నుంచి చల్లమల్ల నరసింహ, ఎండీ హాబిద్, బీఎస్పీ నుంచి ఎం. స్టాలిన్, బీఆర్ఎస్ నుంచి కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నుంచి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయం

**– తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపిన మహనీయుడు**

**– ఆయన ఆశయాల సాధనకు తెలంగాణను సస్యశ్యామలం చేయడమే నిజమైన నివాళి: మంత్రి కోమటిరెడ్డి**






**నల్గొండ, ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా పనిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, తెలంగాణపై అవగాహన కల్పించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని గురువారం నల్గొండలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**నాలుగు కోట్ల తెలంగాణ ఆకాంక్షకు ప్రతిరూపం**

అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసమే పుట్టిన వ్యక్తి అని అన్నారు. విద్యార్థి దశ నుంచే కాకుండా పదవీ విరమణ అనంతరం కూడా తెలంగాణ సాధన కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాలలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్రం అవసరాన్ని తెలియజేశారని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఉద్యమకారుల్లో జయశంకర్ సార్ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. శ్రీకాంత్ చారి వంటి అమరుల బలిదానాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని మంత్రి అన్నారు.

**2028 నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం**

తెలంగాణలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని, మరో 7 వేల పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు, న్యాక్ సెంటర్‌ల ద్వారా మరింత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. నల్గొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసిన అనంతరం సుమారు రూ. 2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, అవన్నీ పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఆగిపోయిన ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు తిరిగి కొనసాగుతున్నాయని, ఇప్పటికే 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసి దేవరకొండ నుంచి బ్రాహ్మణ వెల్లెంల వరకు అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తద్వారా నల్గొండ జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఎంతటి కరువు వచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజీకి చేరుకున్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ ద్వారా పంటలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు డిజైన్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీతో పాటు పాలమూరు–రంగారెడ్డి, తెలంగాణలోని ఇతర ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసినప్పుడే ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆత్మకు నిజమైన శాంతి చేకూరుతుందని మంత్రి అన్నారు. ప్రపంచం ఉన్నంతకాలం ప్రొఫెసర్ జయశంకర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

**గద్దర్ పాటల్లో తెలంగాణ ఉద్యమ చైతన్యం**

గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ కోసం కృషి చేసిన ప్రముఖుల్లో గద్దర్ ఒకరని అన్నారు. తన పాటల ద్వారా తెలంగాణలోని పల్లెపల్లెకు వెళ్లి ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.





# తెలంగాణ ఉద్యమ శిఖరం...

జయశంకర్ సారుకు నివాళులు
(ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92 వ జయంతి సందర్భంగా (జననం 1934 ఆగస్ట్ 6 మరణం 2011 జూన్ 21) రాసిన కవిత)

ఉద్యమానికి కేవలం
ఆవేశం సరిపోదని
ఆలోచనను ఆయుధంగా
మార్చిన మేధో శిఖరం

గణాంకాలే గండ్రగొడ్డల్లుగ మార్చి
దోపిడి గుండెల్లో నిద్రపోయిన
సైద్ధాంతిక సింహం జయశంకర్ సార్

స్వరాష్ట్ర సాధనే శ్వాసగా మలిచి
తెలంగాణ ఆత్మగౌరవ జెండాను
ఎగిరేసిన యోధుడు
నిజాం కాలంలోనే వందే
మాతరం పాడిన ధీశాలి

యావత్ జీవితాన్ని ఉద్యమానికి
అర్పించిన బ్రహ్మచారి
పోరాటానికి భావేద్వేగమే కాదు
బలమైన నిరూపణలు కావాలని
చాటిన మేధావి ఆర్థికవేత్త

నీళ్లు నిధులు నియామకాల
సూత్రాన్ని ప్రతి తెలంగాణ బిడ్డ

గుండెల్లో నాటిన గురువు

జయశంకర్ సార్ సంధించిన
ప్రశ్నలతో పాలకుల గుండెల్లో
వణుకు పుట్టించిన సత్య
నిరూపణ నిధుల వినియోగపై
డొల్లతనాన్ని వెలుగెత్తి చాటిన
మేధావి
దోపిడీని గణాంకాల తో సహా
ప్రపంచానికి చూపిన జ్ఞాన దీపం

తెలంగాణ తల్లి గొంతుకై
దేశ దేశాలు తిరిగాడు
ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను
గల్లీ నుండి ఢిల్లీ చాటాడు
భాషను బతుకుని వివక్షను
ఎలుగెత్తి చాటాడు
కుట్రలు కుతంత్రాలు తిప్పికొడుతూ ఉద్యమ
నాయకత్వానికి దిశా నిర్దేశం చేశావు
కోట్లాది గుండెల్లో రగిల్చిన
స్వరాష్ట్ర కాంక్ష తెలంగాణ
విముక్తికి రాచబాట అయింది

నువ్వు నడిపిన భావజాల సాయుధ తో
పోరాటం
కోట్లాది గుండెల్లో రగిలింది
స్వరాష్ట్ర కాంక్ష బలమైన సైద్ధాంతిక
పునాదిపైనే నేడు సాకారమైంది
మన బంగారు తెలంగాణ
సిద్ధాంతమే ఊపిరిగా




పోరాడిన ఆర్థిక వేత్త
తెలంగాణ జాగృతికి
నువ్వే నిత్య చైతన్య దీప్తి
నీళ్లు నిధులు నియామకాలు
అనే నినాదం ప్రస్తుత ప్రభుత్వ
విధానం కావాలి అవినీతి
రహిత తెలంగాణనునిర్మిద్దాం
ప్రజాస్వామ్య తెలంగాణ
సాకారానికి సన్నద్ధమౌదాం
జయశంకర్ ఆశయాల
సాధనకు ఉద్యమించడమే
నిజమైన నీవాళి

**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు**
**1)తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**2)తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం**
**3)తెలంగాణ వికాస వేదిక**
**4)తెలంగాణ కుమ్మర సంఘం 880/2014**
**హైదరాబాద్**
**9440245771**

# సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు ప్రారంభం



**– జెండాఊపి.....ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు**

**నేరేడుచర్ల ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) :** దేశంలో మోడీ షా ల ద్వయం ప్రతిష్ట మసకబారుతోందని ఇటీవల జరిగిన పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయని ఇది దేశానికి ఎంతో శుభసూచకమని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...

గత 12 సంవత్సరాలుగా అధికారం లో ఉండి ఆడిందే ఆటగా పాడిందే పాటగా వారు వ్యవహరించారని, కానీ నీట్ పరీక్ష పత్రం లీకేజీతో వారి దుష్ట పరిపాలనకు చరమగీతం పాడేందుకు అంకురార్పణ జరిగిందని జనతా కాక్రోచ్ పార్టీ ఆధ్వర్యంలో వెల్లువెత్తిన నిరసన కార్యక్రమం దేశాన్ని కుదిపివేసిందని, మొట్ట మొదటిసారిగా ఒక కేంద్ర మంత్రి చేత విద్యార్థులు, యువకులు రాజీనామా చేయించారని అలాగే బీహార్ లోని బంకిపూర్ నియోజకవర్గంలో బిజెపి దారుణంగా ఓడిపోయిందని గుజరాత్ కూడా గతంలో లక్ష కోట్లు మెజార్టీతో గెలిచినవారు నేడు 30వేల ఓట్ల తో గెలవడం చావు తప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఉన్నదని అలాగే ఝార్ఖండ్ రాష్ట్రంలో కూడా విద్యార్థులు ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ పార్లమెంట్ సమావేశాల్లో అడ్డదారిలో దొడ్డిదారిలో ఇతర పార్టీలను చీల్చి డీ –లిమిటేషన్ బిల్లు పెట్టేందుకు ప్రయత్నం చేసి చివరకు నోరు మూసుకోవాల్సి పరిస్థితి దాపురించిందని ఫక్తు అబద్ధాలతో పరిపాలన కొనసాగిస్తున్నారని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నల్ల డబ్బు వెనక్కి తెచ్చి ప్రతి అకౌంట్లో 15 లక్ష రూపాయలు వేస్తామని రూ50 రూపాయలకె పెట్రోల్ డీజిల్ అందుబాటు లో ఉంచుతామని బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని పెహల్గావ్ ఉగ్రవాదులు భూమి అంచులో ఎక్కడ ఉన్నా పట్టి తెస్తామని ఉత్తరప్రగల్భాలు పలికారని మరి ఏమైందని ఆయన ప్రశ్నించారు

ఇప్పటికైనా దేశానికి పట్టిన ఈ చీడను వదిలించుకోవాల్సిన బాధ్యత విద్యార్థినీ విద్యార్థుల పైన యువత పైన రైతులు వ్యవసాయ కార్మికులు పారిశ్రామిక కార్మికులు అన్ని వర్గాల వారి పైన ఉన్నదని ప్రజలు ఐక్యంగా ఉద్యమించి దేశము నుంచి మతోన్మాదులను చీకటి చాటుకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు

కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి, ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న రైతు సంఘం మండల కార్యదర్శి కటికోల వెంకన్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, మండలాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్ దోమకొండ మనోజ్ పోలగాని రవి బాల సైదా ఎస్.కె హుస్సేన్ చిలకరాజు సైదులు పి రామరాజు డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకు జీపీ కార్మికుల సమ్మె నోటీసు

గరిడేపల్లి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్యసేన): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు గురువారం ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్కే యాకూబ్ మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఆర్సీ అమలు చేయాలని కోరారు. అర్హులైన జీపీ కార్మికులను పంచాయతీ కార్యదర్శులు, కారోబారీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న జరిగే ఉద్యమ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం కార్యదర్శి అంబరవరపు శ్రావణ్ కుమార్, బండ వెంకటరెడ్డి, మచ్చ వీరస్వామి రాజు, నల్లాల సైదులు, వెంకటాచారి, కొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం....



- మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా

**భానుపురి, ఆగస్టు 06 (సూర్య సేన) :** తల్లి పాలతోనే పిల్లలకు ఎంతో ఆరోగ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 41వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు శిశువుకు సహజసిద్ధమైన, సంపూర్ణమైన ఆహారమని ఆయన పేర్కొన్నారు. తల్లిపాలు అందించడం వల్ల శిశువులో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు.

బాలింతలు ఎలాంటి సందేహాలు, అపోహలకు తావివ్వకుండా వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. తల్లిపాల ప్రాధాన్యాన్ని ఇంటింటికీ చేర్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పిల్లలకు యూనిఫామ్ లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీల సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్స్ సువర్ణ, పద్మావతి, సుకన్య, ఆయాలు మంగమ్మ, మల్లమ్మ, నవ్య, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌కు కొత్త పాలకవర్గం ఎప్పుడు?





- ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలని ఆర్డీవోకు సభ్యుల వినతి
- నూతన కమిటీ ఏర్పడే వరకు తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించాలని విజ్ఞప్తి

**సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన) :** సూర్యాపేట పబ్లిక్ క్లబ్ పాలకవర్గం పదవీకాలం ఈ నెల 3వతో ముగియడంతో నూతన పాలకవర్గం ఎన్నికలపై సభ్యులు దృష్టి సారించారు. ఆర్డీవో వేణు మాధవ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. క్లబ్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో నూతన పాలకవర్గం ఎన్నికయ్యే వరకు క్లబ్ పరిపాలనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధ్యక్షుల హోదాలో తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించి నిర్వహించాలని సభ్యులు ఆర్డీవోను కోరారు. క్లబ్ అభివృద్ధి,

పరిపాలనలో పారదర్శకత, సభ్యుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయకుండా త్వరితగతిన నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. నూతన పాలకవర్గం ఎన్నికతో క్లబ్ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. వినతి అందజేసిన వారిలో పెద్దిరెడ్డి గణేష్, పోతు భాస్కర్, డాక్టర్ రామ్మూర్తి, ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, బైరు వెంకన్న గౌడ్, అబ్దుల్ రహీం, కుమ్మరి కుంట్ల వేణు, బాలు గౌడ్, క్లబ్ మెంబర్స్ తదితరులు ఉన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం

**రంగారెడ్డి, ఆగస్టు 06 (సూర్య సేన) :** సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ సీనియర్ సిటిజెన్ భవనంలో జయ శంకర్ సర్ జయంతి సందర్భంగా ఆయనకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషథ్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, సీనియర్ సిటిజెన్ సలహాదారులు విఎస్ఎన్ శ్రీనివాస్ రావు జయ శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొన్నాడ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, తెలంగాణ గురించి ఆయన చేసిన సేవలు కొనియాడారు, విఎస్ఎన్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ అంటే జయ శంకర్ సర్,ఆయన చేసిన ఉద్యమాలు మనందరికీ స్ఫూర్తి అని, ఆయనతో పాటు ఎంతో మంది ఉద్యమకారులు ఉన్నారని అన్నారు.డాక్టర్స్ కాలనీ సీనియర్ సిటిజెన్ బిల్డింగ్ లో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమ పర్యవేక్షణలో భాగముగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం 120,121,122,123,124,బీఎల్ఓలతో మాట్లాడుతూ, పోలింగ్ బూత్ ఏజెంట్లు అయిన బీఎల్ఏలు పార్టీ తరుపున అవేరేజ్ గా అన్ని బూతులు కలిపి 70% సుమారుగా ఉంది. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ మాట్లాడుతూ, బీఎల్ఓలతో పాటు మునిసిపల్ బిల్ కలెక్టర్స్ ఉంటే 100% అవుతుంది అని అన్నారు. ఎందుకంటె హౌస్ నంబర్స్ వారికి తెల్సు హౌస్ టాక్స్ వారికీ కడతారు కాబట్టి యిల్లు ఎక్కడ ఉంటుందో అందులో ఓనర్ సెల్ నెంబర్ ఉ ంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ కోశాధికారి వుటుకురీ దయాకర్, నరేష్, శ్రీనివాస్, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ మొహాద్ ఇష్టిక్ గులషన్ బడంగ్పేట్ అబ్జర్వర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు స్వరూప్ రాజ్, అప్పారావు, సత్యం సీనియర్ సిటిజెన్ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిశు ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం....



- కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే అమృతంతో సమానమని కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 48వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమన్నారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలు అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల లక్ష్యాన్ని ప్రతి కుటుంబానికి చేరవేయాలని, తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీల సూపర్వైజర్ అంజలి, అంగన్వాడీ టీచర్స్ నాగలక్ష్మి, అనంతలక్ష్మి, ఆయాలు సోమలక్ష్మి, రేణుక, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పానుగోడు విద్యుత్ విషాదం..
# చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

- లైన్ క్లియర్ లేకుండానే పనులు? అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు

గరిడేపల్లి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన): గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో ఇటీవల విద్యుత్ మరమ్మతుల పనుల సందర్భంగా కరెంట్ షాక్‌కు గురై విద్యుత్ స్తంభం పై నుంచి కిందపడిన దిసించర్ల గ్రామానికి చెందిన ప్రైవేటు కార్మికుడు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి వైద్యులు ప్రాణాలు కాపాడేందుకు ఒక కాలు, ఒక చేయి తొలగించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు చికిత్స పొందుతూనే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, విద్యుత్ లైన్‌కు సంబంధించిన భద్రతా నిబంధనలు పూర్తిగా పాటించకుండా పనులు చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, సంబంధిత లైన్‌మెన్ కారింగుల అంజయ్య నిర్లక్ష్యం కారణమని ఆరోపించారు. ఘటన జరిగినప్పటి నుంచి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని వారు పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తులతో విద్యుత్ పనులు చేయించడం



నిబంధనలకు విరుద్ధమని తెలిసినా, ఈ ఘటనపై విద్యుత్ శాఖ స్పందించకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ఒక నిండు ప్రాణం బలైపోయిన తర్వాత కూడా బాధ్యులపై చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు

# చట్టాలు ఏమి చెబుతున్నాయి? ఒక అవగాహన....

- ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త, బండి కనకదుర్గ

**రంగారెడ్డి, ఆగస్టు 06 (సూర్య సేన) :** ఇటీవల హైడ్రా కమిషనర్ పై 60 కి పైగా కోర్టుదికార వ్యాజ్యాలు ఉన్నాయని ఈ బాధ్యత నుంచి తప్పించాలని ఇటీవల తెలంగాణ ఉన్నతరణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిందని ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ముఖ్యం అని శాసన కార్యనిర్వాహక న్యాయ అనే మూడు వ్యవస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయని, ప్రముఖ న్యాయవాది సామాజిక కార్యకర్త బండి కనకదుర్గ అన్నారు. గురువారం ఆమె పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ న్యాయ వ్యవస్థ చట్టాలు అమలు జరగకపోతే జరిగేలా కార్యనిర్వాహక వర్గం ఆదేశాలు జారీ చేస్తుందని అన్నారు. స్వతంత్రంగా నిష్పక్షపాతంగా న్యాయస్థానాలు వివరించేందుకు రాజ్యాంగం ద్వారా తగు ఏర్పాటు జరిగిందని హైకోర్టు సుప్రీంకోర్టులకు కాంటెంప్ట్ అధికారాలు కూడా రాజ్యాంగంలోని 215,129, అధికరణాలు ద్వారా దాఖలు పరచబడిందని దేశంలోని అన్య న్యాయస్థానాల అధికారులు సుప్రీంకోర్టుకు సహాయ సహకారాలు అందించాలని




144వ అధికరణం నిర్దేశించిందని అన్నారు. కోర్టులు చట్టాల అనుసరించి న్యాయ నిర్ణయం చేయాలి కానీ సంపూర్ణ న్యాయం చేయడానికి చట్టాలను దాటి కూడా న్యాయ నిర్ణయం చేసే అధికారం ఆర్టికల్ 142 ద్వారా సుప్రీంకోర్టుకు ( విశేష అధికారాలను) కనిపించిందని రాజ్యాంగం న్యాయస్థానాల తీర్పులను గౌరవించే వాటిని అమలు పరచాలని ప్రాథమిక సూత్రమని ఒకవేళ న్యాయం జరగలేదని అనిపిస్తే సుప్రీం కోర్టు వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది అన్నారు.

**- చట్టం ఏం చెబుతోంది?**

న్యాయస్థానాల తీర్పులను గౌరవించకపోతే న్యాయవ్యవస్థ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని అందుకే న్యాయస్థానం తీర్పులను గౌరవించడానికి అమలు పరచడానికి కోర్టులకు కంటెంప్ట్ ఆఫ్ కోర్టు చట్టం 1971 ద్వారా ఆ అధికారం కలగ చేసిందని అన్నారు పార్లమెంటు ఈ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం న్యాయస్థానాల ఆదేశాలు ఉల్లంఘించిన వారికి ఆరు నెలల వరకు జైలు శిక్ష 2000 రూపాయల వరకు గరిమానా లేక రెండు కూడా విధించవచ్చు అని పేర్కొన్నారు. కక్షిదారులే కాక మరెవరైనా న్యాయస్థానాల ఆదేశాల అమలులో అడ్డంకులు కలిగిస్తే వారు కూడా శిక్షార్హులు అవుతారని కాంటెంప్ట్ అధికారం కేవలం హైకోర్టు సుప్రీంకోర్టులకు మాత్రమే కలగ చేసిందని ఈ చట్టం కేవలం శిక్ష నుంచి తప్పించుకోవడానికి కాక నిజాయితీగా క్షమాపణ వేడితే శిక్ష వేయకుండా లేదా తక్కువ కాలానికి శిక్ష విధించవచ్చని ఆ చట్టం స్పష్టం చేస్తుందని కిందిస్థాయి న్యాయస్థానాల ఆదేశాలను పాటించని వారిపై కాంటెంప్ట్ ను విచారించి శిక్షించే అధికారాన్ని హైకోర్టులకి ఇచ్చింది ఈ చట్టం అన్నారు. కోర్టులు చాలా అరుదుగా ఈ అధికారాన్ని వినియోగించాలని సుప్రీంకోర్టు తెలిపిందని కోర్టు తీర్పులను నిజాయితీగా విమర్శించడానికి కాంటెంప్ట్ గా పరిగణించదని కోర్టు తీర్పులను గుణాత్మకంగా విమర్శించవచ్చు కానీ తీర్పునిచ్చిన న్యాయమూర్తిని వ్యక్తిగతంగా విమర్శిస్తే కోర్టు ధిక్కరణకు పాల్పడిన అవుతారని ఇంతవరకు కోర్టు ధిక్కరణ నేరానికి ఎక్కువ కాలానికి శిక్ష అనుభవించింది జస్టిస్ కర్ణన్ సుప్రీంకోర్టు ఆదేశాలను ఖతర్ చేయకపోవడమే కాకుండా ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకే సమన్లు పంపి వారికి జైలు శిక్ష విధించారని తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనకు ఆరు నెలల జైలు శిక్ష విధించిందని సుప్రీం కోర్టు మొత్తం మీద ప్రభుత్వ అధికారులే ఎక్కువగా కోర్టు ధిక్కరణ కేసులకు ఎదురుకోవడం గమనార్ధమని అన్నారు.




# నిద్రపోతున్న నిఘానేత్రం!




**అనంతగిరి, ఆగస్టు 06 (సూర్య సేన) :** అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో దాతల సహకారంతో రెండు సంవత్సరాల క్రితం సుమారు రెండు లక్షల 50 వేల రూపాయలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగినది కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత మూన్నాళ్ళ ముచ్చటగనే ప్రస్తుతం గ్రామపంచాయతీ దగ్గర ఉన్నటువంటి సీసీ కెమెరాలు దానికి సంబంధించిన బాక్సులు కరెంటు స్తంభాలపై వెలవెలబోతున్నాయి సీసీ కెమెరాల పర్యవేక్షణ లోపం వలన గ్రామంలో చౌరస్తాల దగ్గర ఏర్పాటు చేసినటువంటి సీసీ కెమెరాలు బాక్సులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోయినారు సీసీటీవీ కెమెరాలు లేకపోవడం వలన గ్రామంలలో లోగడ గ్రామంలో కొన్ని అవాంఛనీయ సంఘటన జరిగినది గ్రామ పంచాయతీల వద్ద ఉన్నటువంటి మహాత్మా గాంధీ విగ్రహం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం లు కొన్ని

పార్టీ దిమ్మలు జెండాలను కూడా ధ్వంసం చేసినారు గుర్తు తెలియని దొంగలు రామాలయంలో హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన జరిగినవి రాత్రి వేళలో ఊర చెరువు వాటర్ ట్యాంక్ వద్ద ఉన్నటువంటి ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లినారు వ్యవసాయ పనులు జరుగుచున్న వేళ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కరెంట్ మోటార్లు స్టార్టర్ పెట్టెలు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఈ మధ్యకాలంలో

చాలా జరిగినది రాత్రి వేళలో మందుబాబులు మందు తాగి బజార్ల వెంట వీరంగం సృష్టిస్తున్నారు గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రాత్రి వేళలో గోడల దూకి స్కూల్ ఆవరణంలో మందు తాగి సీసాలు పగలగొట్టిన సంఘటనలు జరిగినవి వెంటనే పోలీసు గ్రామంలో ఉన్నటువంటి సీసీ టీవీకెమెరాలను పునరుద్ధించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధన స్ఫూర్తి ప్రధాన జయశంకర్ సార్



- నివాళులర్పించిన బీసీ నేత ధనుంజయ నాయుడు

**నేరేడుచర్ల ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్యసేన) :** తెలంగాణ రాష్ట్ర సాధన స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్రపటానికి మాట్లాడుతూ... స్వరాష్ట్రమే ఆశ, ధ్యాస, శ్వాసగా జీవించాడని నాలుగు కోట్ల ప్రజలలో చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ సిద్ధాంతకర్త అని తెలంగాణ ఆత్మగౌరానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అంకితమైన తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ అని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించాలంటే మూడు దశల్లో ఉద్యమం నిర్వహించాలని మొదటి దశ తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేయాలని రెండోది ఆందోళన కార్యక్రమాలకు రూపుదిద్దాలని చివరిగా రాజకీయ ప్రక్రియ జరగాల్సి ఉంటుందని భావించి దానిని పూర్తి చేయడమే ఉ ద్యమ కర్తవ్యం కావాలని అందుకు రాజకీయ చిత్తశుద్ధి అవసరమని నమ్మి ఆ వైపు ప్రయాణం చేసి అనేక మందిని తెలంగాణ వాదులుగా తయారుచేసి ఉద్యమ బాట పట్టించి తెలంగాణ కలను సాకారం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని అన్నారు

మన తెలంగాణ మనం సాధించుకుంటే మన పొలాలకు నీళ్లు వస్తాయి అని మన పిల్లలకు చదువులు,కొలువులు వస్తాయని గట్టిగా విశ్వసించారని తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని ఆయన కొనియాడారు జయశంకర్ సార్ జయంతి కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, మండలాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్, పట్టణ ప్రధాన కార్యదర్శి దోమకొండ మనోజ్ అభిలాష్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు

# చదువుతోనే బాలికల సాధికారత...

**గరిడేపల్లి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) :** పీఎం శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం 'బేటీ బచావో--బేటీ పడావో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ బాలికలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి ఆర్థిక స్వావలంబన సాధించే వరకు విద్యను కొనసాగించాలని సూచించారు. బాలికలను వేధిస్తే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేవతి సమాజంలో ఆర్థిక, సామాజిక సమానత్వం అవసరమని పేర్కొనగా, వినోద్ సమాజంలో చైతన్యం పెరిగితేనే వివక్షకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రసన్నకుమారి విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సూచించారు. ప్రహరీ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కందుల శివకృష్ణ అవకాశాల కోసం



ఎదురుచూడకుండా వాటిని సృష్టించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, వీరభద్రం, విష్ణువర్ధన్, దామ్లా, చిన్న బాలయ్య, వెంకటేశ్వర్లు, శాంతిప్రియ, మల్లికార్జున్‌రెడ్డి, షాహిద్ అక్బర్, అనిల్, నాగుల మీరా, నవాబ్, భూలక్ష్మి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# జయశంకర్ జయంతి ఘనంగా...




**హుజూర్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్యసేన) :** పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, కమిషనర్ కె. సతీష్‌కుమార్, కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, పురపాలక సంఘ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

# బీజేపీకి కొత్త సారథులు.. పార్టీ బలోపేతమే లక్ష్యం



భారతీయ జనతా పార్టీ
సూర్యాపేట జిల్లా

CHALLA SRILATHA REDDY M.A, L.L.B
District President

Date : 06-08-2026

Press Release

Town and Mandal Presidents

Mandal Presidents of the Suryapet District have been appointed by District President Smt. Challa Srilatha Reddy , they are mentioned below

| S.NO | Name Of The President | Town&Mandal | Constituency |
|---|---|---|---|
| 1 | Boora Malsoor Goud | Suryapet Town 2 | Suryapet |
| 2 | Kandhula Ramesh | Suryapet Town 1 | Suryapet |
| 3 | Vallapu Ashok | Maddhirala | Thungathurthy |
| 4 | Kappala Hanumanthu | Nuthankal | Thungathurthy |
| 5 | Madugula Laxmi Narayana | Huzurnagar Rural | Huzurnagar |

District President

**- జిల్లాలో ఐదుగురు నూతన పట్టణ, మండల అధ్యక్షుల నియామకం**

**- నూతన అధ్యక్షులకు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి శుభాకాంక్షలు**

**సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన) :** భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సూర్యాపేట టౌన్ -1 కందుల రమేష్, టౌన్ -2 బూర మన్సూర్ గౌడ్, మద్దిరాల వల్లపు అశోక్, నూతనకల్ కప్పల హనుమంతు, హుజూర్నగర్ మండలం మాడుగుల లక్ష్మీనారాయణ నూతన పట్టణ, మండల అధ్యక్షులను ఐదుగురిని నియమించారు. బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నూతన అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న అధ్యక్షులకు జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుల నియామకంతో పట్టణ, మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయని బీజేపీ జిల్లా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు.

# టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

**- సంఘం బలోపేతంతో పాటు సమస్యలపై పోరాటం**

**- టిడబ్ల్యూజేఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య**



**సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** జిల్లా కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నందిపాటి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె చాంద్ పాషా సూపర్ టీవీ రిపోర్టర్ ఎస్.కె ఆషిఫ్ కు సభ్యత నమోదు రసీదు అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ముమ్మరంగా కొనసాగుతోంది. ఎన్నో ఏండ్లుగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక, కనీస వేతనం లేక అరకొర జీతాలతో కాలం వెళ్లదీస్తున్న జర్నలిస్టులు ఇకపై సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాలు కంటితుడుపు చర్యగా చర్యలు చేపట్టడమే తప్ప జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోతున్నాయన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటున్న వర్కింగ్ జర్నలిస్టులపై చిన్న చూపు తగదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల మండల అధ్యక్షులు కొంగల సతీష్, కార్యవర్గ సభ్యులు సందీప్, భిక్షం గౌడ్, జంపయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పేటలో ఘనంగా జయశంకర్ సర్ జయంతి వేడుకలు



సూర్యాపేట, ఆగస్టు 06 (సూర్య సేన): ప్రొఫెసర్ జయశంకర్ సర్ జయంతి వేడుకలు సూర్యాపేట లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో మాజీ మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు,
కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పీఏ బసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఉప్పల ఆనంద్, మాజీ ఎంపీపీ నేమ్మాది బిక్షం, మాజీ జడ్పీటీసీ జీడీ బిక్షం, మండల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు తూడి నర్సింహారావు, అంగిరేకుల నాగార్జున, ఆకుల లవకుశ, తాహెర్ పాషా, అనిల్, జ్యోతి లింగా నాయక్, ముదిరెడ్డి అనీల్ రెడ్డి, ఆనంతుల విజయ్, మోత్కూరి సందీప్, రఫీ, శంకర్ నాయక్, అశోక్ నాయక్, సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్‌కు ఘన నివాళి

**నేరేడుచర్ల ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో ఆయన చేసిన త్యాగాలు, సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు జయశంకర్




చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ సారా తరలింపు.. వ్యక్తిపై కేసు



హుజూర్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన): ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాలకీడు మండలం జానపాడు గ్రామ శివారులో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. మహంకాళిగూడెంకు చెందిన బనావత్ లక్ష్మయ్య హోండా యాక్టివాపై 10 లీటర్ల సారాను తరలిస్తుండగా ఎస్ఐ దివ్య ఆధ్వర్యంలో దాడి నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సారాను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. దాడిలో సిబ్బంది సిద్ధి నాగరాజు, రమణ, డ్రైవర్ నరేష్ పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి....




**- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి**

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 06 (సూర్య సేన) :** ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


ఈ కార్యక్రమంలో జయశంకర్ చిత్రపాటనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి కి బాటలు పడినాయని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ షఫి వుల్లా, కౌన్సిలర్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న. కౌన్సిలర్ లు గుణగంటి హేమ సతీష్, మన్నెం అరుణమల్లేష్, తహెర్ మున్నీర్ , ధరావత్ విజయ, నాయకులు బండారు వెంకన్న,పోతురాజు అనిల్, మున్సిపల్ ఇ ఇ కిరణ్, డి ఇ ప్రణయ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మాధవి, గౌసుద్దిన్, జూనియర్ అసిస్టెంట్ లు యాదగిరి, ఎస్ ఎ స్ ఆర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# బిడ్డకు....తల్లిపాలను మించిన దివ్య ఔషధం... మరొకటి లేదు......



**- పోకల వెంకమ్మ అంగన్వాడీ టీచర్**

**గరిడేపల్లి ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) :** తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలని పుట్టిన గంటలోపు ముర్రు ప్రాలు త్రాగించడం వలన బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు వయస్సు పూర్తయ్యేంతవరకు కూడా కేవలం తల్లిపాలను మాత్రమే త్రాగించాలని దాని వలన బిడ్డకు మరియు తల్లికి ఆరోగ్యపరంగా కలిగే లాభాలను ఆమె గర్భిణీ బాలింతలకు వివరించారు. బిడ్డ కడుపులో ఉండగా తల్లి ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా తింటే, తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు కడుపులోని బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు.ప్రతి తల్లి కూడా తన బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేంతవరకు కేవలం తల్లి పాలను మాత్రమే త్రాగించాలని, ఆ విధంగా బిడ్డకు తల్లిపాలను త్రాగిస్తే, బిడ్డ ఆరోగ్యంగా ఉండటం తో పాటు,తల్లీ బిడ్డల మధ్య కూడా ఆప్యాయత అనురాగాలు, మమతానుబంధాలు పెరుగుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, తాళ్ళ అనిత,ఆయాలు గోవిందమ్మ,నాగమణి, మరియు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్‌పై నార్కోటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు

**హుజూర్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 06 (సూర్య సేన) :** మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు గురువారం నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో జిల్లా డాగ్ స్క్వాడ్‌తో కలిసి బస్టాండ్‌లు, హోటళ్లు, దాబాలు, కిరాణా, మెడికల్ షాపులు, పాఠశాలల ప్రాంగణాల్లో సోదాలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై నిశితంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేశ్ మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్, హుజూర్‌నగర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకు లకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనుల ను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయంఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి..దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# అడివి శేష్ కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్.. రాహుల్ రవీంద్రన్‌తో క్రేజీ కాంబినేషన్!



టాలీవుడ్ హీరో అడివి శేష్ తన వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. తాజాగా ఆయన నటించిన డెకాయిట్ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందన అందుకుంటోంది. దర్శకుడు షానీల్ డియో తెరకెక్కించిన ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించగా, ప్రముఖ నటులు అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు.ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అడివి శేష్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. నటుడు-దర్శకుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తాను ఓ సినిమా చేయబోతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించాడు. ఇటీవల రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తెరకెక్కించిన ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రం మంచి ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన శేష్ కోసం కూడా ఒక బలమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే ఈ క్రేజీ కాంబినేషన్ వెంటనే పట్టాలెక్కే అవకాశాలు లేవు. ప్రస్తుతం అడివి శేష్ తన సూపర్ హిట్ చిత్రం గూఢచారికి సీక్వెల్‌గా వస్తున్న +2 షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ పనులు పూర్తయ్యాకే రాహుల్ రవీంద్రన్ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అడివిశేష్ సెలెక్టివ్ కథలఎంపిక, రాహుల్ రవీంద్రన్ ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్ కలవడంతో ఈ కొత్త సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కాంబినేషన్ నుంచి మరో విభిన్నమైన సినిమా రావడం ఖాయం అని అభిమానులు భావిస్తు న్నారు. చూద్దాం ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి క్లారిటీ ఎప్పుడు వస్తుందో అనేది. కాగా, భారీ అంచనాలతో థియేటర్స్ లోకి వచ్చిన డెకాయిట్ మూవీఓ మోస్తరు వసూళ్లు రాబడుతున్నట్టు తెలుస్తుంది. ఈ మూవీ లాభాల్లోకి చేరుకుంటుందా లేదా అనే చర్చ జోరుగా నడుస్తుంది.

# 'స్వయంభు' కూడా ఇప్పట్లో వచ్చేలా లేదుగా..

యువ హీరో నిఖిల్ సిద్ధార్థ కెరీర్‌లోనే అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న పీరియడ్ నేపథ్య చిత్రం 'స్వయంభు.' ఈ మూవీ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ మూవీ మరోసారి వాయిదా పడనుందని తెలుస్తుంది. ప్రారంభంలో ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయాలని భావించినప్పటికీ, తరు వాత వేసవి కాలానికి మార్చారు. ఇప్పుడు మరోసారి విడుదల తేదీ మారే పరిస్థితి ఏర్పడింది.చిత్ర బృందం ఏప్రిల్ 30న రిలీజ్ చేయాలని పరిశీలించినప్పటికీ, సాంకేతిక పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఆ తేదీ సాధ్యం కాలేదని సమాచారం. ముఖ్యంగా చిత్రంకి సంబంధిం చిన భారీ వీఎఫ్ఎక్స్ పనులకి మరింత సమయం పడుతుందని తెలుస్తుంది. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతిదృశ్యం అత్యున్నత స్థాయిలోఉండేలా చిత్ర బృందంశ్రద్ధ తీసుకుం టోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన విజువల్స్




కథలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే అవి పూర్తి స్థాయిలో మెరుగ్గా రావాలని హీరో నిఖిల్ సిద్ధార్థతో పాటు చిత్ర యూనిట్ పట్టుదలగా ఉంది. తొందరపడి విడుదల చేయడం కంటే, పూర్తి స్థాయి పనులు ముగిసిన తర్వాతే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం,

ఈ చిత్రాన్ని మే నెల చివరి వారంలో విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విడుదల తేదీ ఖరారైన వెంటనే ప్రచార కార్యక్రమాలు కూడా భారీ స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# అల్లు అర్జున్ ఫ్యూచర్ లైనప్ ఫుల్ బిజీ..

## ప్రశాంత్ నీల్ సినిమా ఎప్పుడు?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. 'రాకా' సినిమా తర్వాత ఆయన ఎవరితో పని చేయబోతున్నారు? అన్న ప్రశ్నపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న రాకా పూర్తయ్యిన వెంటనే అల్లు అర్జున్ తన డ్రీమ్ లైనప్‌ను అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లైనప్‌లో స్టార్ డైరెక్టర్లు ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా ఉండటం విశేషం. అయితే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బన్నీ-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మాత్రం వెంటనే ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దానికి ప్రధాన కారణం ప్రశాంత్ నీల్ ప్రస్తుతం యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉండడం . ఈ భారీ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా రూపొందనుందని సమాచారం. నీల్ తన స్టైల్ ప్రకారం ఈ రెండు భాగాలను పూర్తి చేసిన తర్వాతే కొత్త ప్రాజెక్ట్‌ను చేపట్టే అవకాశం ఉంది. అందువల్ల అల్లు అర్జున్‌తో ఆయన సినిమా ప్రారంభం కొంత ఆలస్యం కావచ్చు. మరోవైపు అల్లు అర్జున్ షెడ్యూల్ కూడా బిజీగానే ఉంది. ప్రస్తుతం 'రాకా'పై దృష్టి పెట్టిన ఆయన, ఆ తర్వాత వెంటనే దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో చేయనున్న #AA23 ప్రాజెక్ట్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ సినిమా కూడా భారీ అంచనాల మధ్య రూపొందనుంది. అలానే త్రివిక్రమ్ దర్శకత్వంలో కూడా బన్నీ ఓ మూవీ చేయనున్నట్టు సమాచారం. ఇలా ఇద్దరు స్టార్స్ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటంతో బన్నీ-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ కోసం అభిమానులు మరికొంతకాలం వేచి చూడాల్సి వస్తోంది. అయితే ఈ కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్లినా, అది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక భారీ యాక్షన్ డ్రామాగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే బన్నీ చేస్తున్న రాకా ప్రాజెక్ట్ బాక్సాఫీస్‌ని షేక్ చేయడమే కాకుండా అనేక రికార్డులు సెట్ చేస్తుందని అంటున్నారు.

# 'ఐరెన్ లెగ్' ముద్ర బాధాకరం



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కృతి శెట్టి తన కెరీర్‌లో ఎదుర్కొంటున్న విమర్శలపైతాజాగా స్పందించారు. నటిగా ప్రతి సినిమాలోనూ తాను వంద శాతం శ్రమిస్తానని, పాత్రకు న్యాయం చేయడానికి ఎలాంటి రాజీ పడనని చెప్పారు. అయితే సినిమా ఫలితంమాత్రం పూర్తిగాతన చేతిలో ఉండదని, అలాంటి పరిస్థితు ల్లో 'ఐరెన్ లెగ్' అనిముద్ర వేయడం తనను తీవ్రంగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హిట్ అవుతుందా, ఫ్లాప్ అవు తుందా అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, కేవలం తనను లక్ష్యంగా చేసుకుని విమర్శిం చడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. కొన్నిసార్లు కేవలం అదృష్టం లేకపోవడం వల్ల అవకా శాలు కోల్పోవడం ఒక నటిగా తనను కృంగదీస్తోందని తెలిపారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రంపై కూడా కొన్నిసందేహాలు వ్యక్తమవుతున్నాయని, అవి తనను కలచివేస్తున్నాయని కృతి వెల్లడిం చారు. అయినప్పటికీ తన కృషిని మాత్రం ఎప్పటికీ ఆపబోనని, మంచి కథలతో ప్రేక్షకులను అలరించడానికి ప్రయత్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో తాను 'ధీమా' అనే పాత్రలో కనిపించనున్నట్లు కృతి చెప్పారు. సోషల్ మీడియాకు బానిసైన, 'నోమోఫోబియా'తో బాధపడే యువతిగా నటించడం తనకు కొత్త అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. కథ 2040 నేపథ్యంతో సాగుతున్నప్పటికీ, ప్రస్తుత సమాజానికి బాగా కనెక్ట్ అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ సమయంలో ప్రముఖ నటి నయనతారతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని కృతి తెలిపారు. ఒక సందర్భంలో తనకు సమస్య ఎదురైనప్పుడు నయనతార స్వయంగా ఫోన్ చేసి గైడ్ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.ఇక సోషల్ మీడియాలో వచ్చే నెగటివ్ ట్రోల్స్‌పై కూడా కృతి స్పందించారు. విమర్శలు చేసేవారు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలని, పాజిటివ్‌గా ఆలోచించడం చాలా ముఖ్యం అని సూచించారు.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com


www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com